# విశ్వాన్ని పరిహసించిన ఈశ్వర్

(క థా ని క)

సాయంకాలం షికారుకు స్నేహితులందరం రైలుకట్ట వెంబడే చాలాదూరం పోతూ ఉండేవాళ్ళం. స్నేహితుల్లో ఎవరు వచ్చినా రాకపోయినా శర్మ రాకపోయినట్లయితే నాకు ఆరోజున వాహ్యాళికి వెళ్లినట్లే ఉండదు. ఎందువలనంటే మా శర్మ (అందరికిమల్లెనే) ఇరవయ్యో శతాబ్దంలో ఉంటున్నవాడు కాబట్టి కవిత్వంమీద అభిమానమే కాకుండా రసాస్వాదన చేయగల శక్తి కూడా కొద్దిగా ఉన్నది. కవిత్వం, దాని విశిష్టత, ఈ శకంలో అది ఏవిధంగా రూపుచెందినదీ, ఎంతమంది "నవ్యకవిత్వం" వ్రాసినదీ, ఎంతమంది ఆపేరు వాడుకొంటున్నదీ అనర్గళంగా కొద్దిమంది స్నేహితుల సముదాయానికయితే నాల్గుగంటలు ఉపన్యాసం దంచి చెపుతాడు. టాల్‌స్టాయ్, ఠాగూరునుంచి ఇలియాట్ దాకా ప్రతి మహాసాహిత్యవేత్త సుభాషితాలను మనలకు వినిపించి మనలని కూడా ఆ ప్రపంచంలోకి తీసుకొనిపోతాడు.

ఆరోజు అదృష్టవశాత్తు మా స్నేహితులు ఎవ్వరూ రాలేదు. నేను శర్మ ఇద్దరమే షికారుకు వెళ్ళే అవకాశం లభించింది. రైల్వే స్లీపర్లమీద మా నడక. చుట్టూ పచ్చని వరిపొలాలు. వరిపొలాల వెనుక భూమి ఆకాశాల కలయిక. వరిపొలాలని చీల్చుకుంటూ రైలుమార్గం. ప్రక్కనే తంతితీగలు- తంతి స్తంభాలలో శబ్దాలు. నిమిషాలతోసహా లెక్కగట్టుకొని పనిచేసేనాకు ఇటువైపుకు రానట ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. శర్మ ఆనందంలో తేలియాడతాడు ప్రకృతి సౌందర్యాని తిలకిస్తూ. కొంచెము దూరం పైకి పోయి మురుగు కాల్వ వంతెనమీద కూర్చున్నాం. దూరాన ఒక తెల్లని వస్తువు కనుబడుతూంది. అది సమాధి అయి ఉంటుందని నేను అనుకున్నాను. అప్రయత్నంగా శర్మ దృష్టికూడా దాని మీదికి ప్రసరించింది.

"అది ఎవరిదో నీకు తెలుసా?" అడిగాడు శర్మ.

"సమాధిని గురించి తెలుసుకోవలసిన అవసరం ఏం వచ్చింది? ఎవరిదో ఒక వెంకయ్యది అనుకొందాం" అన్నాను.

"మనకు తెలుసుకోవలసిన అవసరం ఏమొచ్చింది? అవునులే. ఎంతమంది చావటంలేదూ?" అని తనలో తాను అనుకుంటూ "తమాషా ఎక్కడ ఉన్నదో చూచావా? ఆ సమాధి ఒక చక్కని యవ్వనవతిది ఎందుకు కాకూడదు. ఆమె ఏదో గొప్ప త్యాగంచేసి (ప్రేమవ్యవహారమని అర్థమా?) తనజీవితాన్ని ప్రాయంలోనే ఎందుకు ధారపోసి ఉండకూడదు?" అన్నాడు శర్మ. ఇంత చిన్న విషయంమీద ఇంత కామెంటరీ ఇస్తాడని నేను అనుకోలేదు. మంచి వాళ్లెప్పుడూ ప్రతివిషయంలోనూ కాంతివంతమైన భాగంవైపే చూస్తుంటారని మీరంతా అనవచ్చు. అంత సున్నితమైన వాడు కాబట్టే ప్రతిచిన్న విషయంలోనుంచి గొప్పభావాలని తీయగలుగుతాడు.

మేము అప్పుడప్పుడూ దానిని చూస్తునే ఉంటుంటాము. దానిని గురించి ఆలోచించవలసిన అవసరం మాకు ఎన్నడూ కలగ లేదు. శర్మకూడా దానిని చూస్తునే ఉంటుంటాడు గాని ఇదివరకెప్పుడూ దానిని గురించి ప్రస్తావించ లేదు.

"ఒక గొప్ప త్యాగమూర్తి, ధన్య జీవి అయిన ఏ మహా ఇల్లాలిదో ఎందుకు కాకూడదు" అన్నాడు.

"నిజమే ఎందుకు కాకూడదూ?" అన్నాను.

నేను ఎదురించకుండా అతడు అన్నదానిని ఒప్పుకునేటప్పటికి అతడు మాట్లాడటానికి వీలు

మొవ్వ రాంబాబు

లేకపోయింది. అదే కనుక ఏ శ్రామికుడిదో కష్టజీవిదో లేక మరి ఏ రైతుదో ఎందుకు కాకూడదు? అని నేనన్నట్లయితే శర్మ విజృంభించి ఉండేవాడు. ఆసమాధి ఏకాంతంగా చేలో ఒకమూల ఉన్నది కాబట్టి ఆ చేనుగల ఆసామి పూర్వీకులదై ఉంటుందని నా ఊహ. పుట్టినందులకే బ్రతుకుతున్నట్లుగా జీవించి చనిపోయిన వాళ్లు ఎంతమంది లేరు? వారిలో ఒకరై ఉంటారని నేను అనుకుంటూండేవాడిని. నేను అంతకన్నా ఎక్కువ ఆలోచించ లేను.

ఎందుకంటే,

"మా జీవితాలకల్లా
సారె గదిలోనిదే గోమాన్ను
పెద్ద దొరముందు మాట్లాడడమే ఎడ్వెంచరు
ఇంక్రిమెంటే మోక్షం."

అటువంటి నాకు సుఖమంటే డబ్బులు సంపాదించటం, అంతరాత్మ అంటే భార్యకు కూడా చెప్పకుండా రహస్యాలు దాచగల శక్తికలిగి ఉండటం. అంతే. అటువంటి నాకు ఒక గంట విశ్రాంతి దొరకటం గొప్పపని. పైరు గాలి పీల్చుదామని ఇటువైపు రావటం తప్ప నాకు నిజంగా ఇటువంటివి పట్టవు.

"బాబూ ఒక నిప్పుపుల్ల ఇస్తారా?" అని రైల్వే గ్యాంగిపనివాడు కనకయ్య అడిగేటప్పటికి వెనుతిరిగిచూచాడు శర్మ. నిప్పుపెట్టె ఇచ్చి కనకయ్యని అడిగాడు ఆ సమాధి ఎవరిదని.

"అదంతా చెప్పాలంటే చాలా అవుతుంది లెండి. ఇప్పుడు యెక్కడ. పొద్దులేదు" అన్నాడు కనకయ్య.

"ఫరవాలేదు. నీకు తెలిసినంతవరకు కొద్దిలో చెప్పు. ఇంతలో ఏమి పొద్దు పోతుంది? మేము మాత్రం ఇళ్ళకు పోయేవాళ్ళం కాదూ?" అని అనేటప్పటికి తప్పించుకోలేక కనకయ్య చెప్పటం మొదలుపెట్టాడు.

* * *

"ఇందూ! ఆ తలుపు తియ్యావే ఉక్కపోస్తూంది. గాలి తగలకూడదంటారు ఎక్కడి మనుషులే మీరు" అన్నాడు ఈశ్వరరావు.

"గోలచేయకుండా పడుకోండి. ఇప్పుడే డాక్టరు వస్తాడు" అన్నది ఆమె.

"ముందు తలుపుతియ్యావే?"

"బయట చలివేస్తూందండి. చలిగాలి తగలకూడదన్నారు డాక్టరు." అని ఆమె అనేటప్పటికి ఆమెవంక నెమ్మదిగా జాలిగాచూస్తూ తల ప్రక్కకు త్రిప్పాడు ఈశ్వరరావు. అతనిదృష్టి ఆ ప్రక్కనఉన్న ఫోటో స్టాండుమీదకి ప్రసరించింది. తను గీస్తున్న ఆ చిత్రముపూర్తి అవుతుందా? చిత్రం పూర్తి కానిదే అతని మనస్సుకు శాంతిలేదు.

ఈశ్వర్ చిత్రకారుడు. ఘనీభవించిన సంప్రదాయ సిద్ధమయిన చిత్ర లేఖనానికి అతడు కొరకరాని కొయ్య. అతని చిత్రాలకి ప్రదర్శనాలు లేవు. అతడు చిత్రలేఖకుడని అసలు ప్రపంచానికి తెలియదేమో. తెలిసినా అతన్ని గుర్తించలేదు. గుర్తించనవసరం లేదంటాడు ఈశ్వర్. ఆ చిత్తరువు పూర్తికాక మునుపే తను చనిపోతే ఎట్లా? నిశ్శబ్దంగా లేవబోతున్నాడు చిత్రం దగ్గరకుపోవటానికి. ఏమాత్రం చప్పుడు జరిగినా ఇందు వస్తుంది. తనని మరల పండుకో బెడుతుంది. అది పూర్తికానిదే అతని మనస్సుకు శాంతిలేదు. ఇంతలోనే డాక్టరు ముకుందరావుగారు వచ్చారు. డాక్టరు స్ఫురద్రూపి. ప్రాక్టీసు పెట్టి కొద్దిసంవత్సరాలే అయినా మంచిపేరు సంపాదించుకున్నాడు. ఇంకా మర్యాద, పెద్దమనిషితనం (ఇతర్లను నొప్పించకుండా మాట్లాడే విధం) అలవడలేదు. వస్తూనే బ్యాగ్ చిన్న టేబిలు మీద పెట్టి ఈశ్వర్ మంచం మీద కూర్చుని అతని భుజం తట్టుతూ ఈ పూట ఎట్లా ఉన్నదండీ అని అడిగాడు. ఆర్టిస్టు ఏమీ మాటాడలేదు. డాక్టరు "మీరు ఇట్లా అయితే లాభంలేదండీ" అని, "ఇందుమతిగారూ" అంటూ ఇందూని ఉద్దేశించి నెమ్మదిగా కేక వేసాడు.

ఆమె రాగానే "ఏమండీ! మీరన్నా అతని చేత మందు త్రాగించకపోతే తర్వాత విషమిస్తుంది" అని అన్నాడు. ఆమె ఏమీ మాట్లాడలేదు. చిన్నపిల్లవాడివంక చూచినట్లు చూసింది ఈశ్వర్ వంక. ఇంతలో ఈశ్వర్ "డాక్టర్ గారూ మందువల్ల యేమీ ఇబ్బందిలేదు. కొంచెం తియ్యటి మందు పంపించండి, చూడండి, ఒక వందరూపాయలు ఉంటే ఇచ్చిపోండి. మళ్ళా

రెండు మూడు రోజుల్లో సర్దుకొంటాం" అని అడిగాడు. డాక్టర్ నవ్వుతుంటూ డబ్బు ఆమె చేతికిచ్చాడు ఆమె కళ్ళల్లోకి చూచి నవ్వుతూ.

"డాక్టరుకే ఇవ్వవలసింది, డాక్టర్ దగ్గర మీరు డబ్బు పుచ్చుకుంటున్నారు. సరే మీ విషయంలో అన్నింటికి ఒప్పుకుంటాను. కాని మీకు జబ్బు నయం కావటంలేదు" అన్నాడు డాక్టరు.

"జబ్బునయం అవుతుంది లెండి. మీరు వెళ్ళి పంచదార నీళ్ళు పోసి మందు పంపండి. జబ్బు నయమవుతుంది" అన్నాడు ఈశ్వర్. డాక్టర్ వెళ్ళిపోంగానే ఇందుమతి అతనిదగ్గరకు వచ్చి నెమ్మదిగా అతని భుజాలని ఒత్తుతూ, "ఎందుకండీ అతనిదగ్గర ఎప్పుడూ అట్లా డబ్బు గుంజుతూంటారు?" అని అడిగింది.

"పిచ్చిదానా. అతనిదగ్గర మనం ఏమి గుంజినట్లు? వాడికి బోలెడంత ఆస్తి ఉన్నది. మేమిద్దరం కాలేజీ రోజులప్పటినుండి ఎరుగుదుము. చదువు పూర్తయిన వెంటనే ఎక్కడనుంచో ఒక 'మామ' ఊడిపడి నిక్షేపంలాంటి పిల్లతో సహా ఇరవయి ఎకరాల భూమి యిచ్చి యింకా సంపాదిస్తూ నే ఉన్నాడు వీళ్ళకొరకు. మరి నాకు అట్లా..."

"సరేలెండి. అట్లాఅయితే డబ్బుయిచ్చే మామనే చూచుకోకపోయారూ? మీకు జరిగిన అన్యాయానికి మీరు ఒకరిని మోసంచేస్తే ఎట్లాచెప్పండి" అంటూ దుప్పటి నెమ్మదిగా కప్పి అతని తలని తన బాహువుల్లోకి తీసుకొని అతని వెనుకదిండ్లని సరిచేసింది.

"నా ఇందువికాదూ! నీవు ఉండగా నాకు యింకా ఏంకావాలి" అంటూ ఆమె బాహువుల్లోకి హత్తుకుపొయ్యాడు. ఆమె అతన్ని నెమ్మదిగాపండబెట్టి "మందు తెస్తాను ఉండండి" అన్నది.

"మందూ వద్దు ఏమీ వద్దు. పిచ్చిపిల్లా! ఆ డాక్టరు మన యింటికి రోజూ ఎందుకు వస్తున్నాడో తెలియటంలేదా? వాడురోజూ నిన్ను చూడటానికి వస్తున్నాడు. ఇంకా డాక్టరు మందు నాకెందుకూ" అన్నాడు నెమ్మదిగా. ఆమె నిర్ఘాంతపోయింది.

"అయితే డాక్టరుని రావద్దని చెప్పండి."

"ఎందుకు? డాక్టరువస్తే నిన్ను ఏంచేస్తాడు? అందమయిన వస్తువులని చూడటానికి అందరూ ఆశిస్తారు ఇందూ. మన డాక్టరు చేసుకున్న పాపం ఏమున్నది? నీవు అందమయిన దానివి కాబట్టి నిన్ను అందరూ చూస్తుంటారు. పైగా మన సౌఖ్యాలని చెడగొట్టుకోటానికి మనసు ఎంత యిష్టపడదో అట్లాగే ఇతరుల ఆనందాన్ని చెడగొట్టవద్దని నీకు అనేక మార్లు చెప్పాను" అని అంటూ తనలో తాను నవ్వుకుంటూ "హా! మన డాక్టరు చాలా మంచివాడుకాదూ!" అన్నాడు.

"ఈ డాక్టరు వద్దు. దుర్మార్గుడు. రేపు రానివ్వండి. ఏమిచేస్తానో!" అన్నది ఆమె కోపంగా. ఆమెకి ఎన్నడూ ఇటువంటి ఆలోచనే కలుగలేదు. ఆమెకు కోపంతో మొఖం కందిపోయింది.

"ఓ ఇందూ. చెపుతున్నా విను. డాక్టరు నా చిన్ననాటి స్నేహితుడు. అతన్ని నీవు ఏమిచేసినా సరే నేను చచ్చిపోయినంత ఒట్టు" అని అతడు అనేటప్పటికి ఆమె "శివశివా" అంటూ చెవులు మూసుకుంది.

"శివుడూలేడు గివుడూలేడు. ఇందూ! నీ శివుడు వచ్చి నన్ను రక్షించలేడు. ఇందూ చావు అంటే ఎందు కంతభయం?"

"మీరు విశ్రాంతిగా పండుకోండి. భగవంతుడే మిమ్మల్ని రక్షిస్తాడు."

"ఇందూ మరణ జననాలని గురించి మెట్ట వేదాంతాన్ని గురించీ ఉపన్యాసాలుఇవ్వటమంటే నాకు బహు అసహ్యం. అంతకన్నా వృథా ప్రయాస ఇంకొకటి ఉండదు. ఐనాకూడా ఒక్క విషయాన్ని గురించి మాత్రం చెప్పాలి ఇందూ. నేను పుట్టి పెరిగినప్పటినుండీ ఒక్కపనీ ఇతరులకి ఇష్టమయినది చేయలేదు. ఇతరులకి సహాయం చేయాలని ఎన్నడూ నాకు బుద్ధి పోయేదికాదు. ఎప్పుడూ ప్రపంచానికి ఎదురు తిరిగాను. ప్రతి విషయాన్ని ఎదుర్కొన్నాను. అనేకమందిని ఖండించాను. చాలామందిని మోసగించినందుకి గర్వపడ్డాను. ఇందూ" అతని స్వరం నెమ్మదిగా తప్పుతూంది. ఆమె అతన్ని తన చేతుల్లోకి సుకుంది.

"కాని ఇందూ! నేను ఇద్దర్ని మాత్రం మోస గించలేదు. ఆ బొమ్మలవైపు చూడు. అవి పూర్తికాలేదు. నీవూ అట్లాగే ఉన్నావు. మీ ఇద్దరినీకూడా నా జీవిత పరమావధులయిన మీ ఇద్దరినీ యెవ్వరికి అప్పగించాలి? అనే ప్రశ్న నాకు చిరకాలంనుండి ఉన్నది" అన్నాడు క్షీణస్వరంతో.

"మీరు ఎవ్వరికీ అప్పగించవద్దు. మీరే వుంటే మీతోనే ఉంటవి" అన్నది. ఆమె కన్నులనిండా నీరు తిరిగింది.

"లాభంలేదు. నీ శివుడు జయించాడు. నన్ను తీసుకొనిపోతాడు. నీ మాట వినడు. ఇంకొక్క చివరిమాట ఇందూ!"

"చెప్పండి."

"మన ఇద్దరికీ పెండ్లి అయినప్పటినుంచీ నీవు నాకు ఒక్క అప్రియమైన పనికూడా చేసిఉండ లేదు. ఇక ముందుకూడా అట్లాగే నాకు అయిష్ట మైనపనులు చేయనని అనూ"అన్నాడు ఆర్టిస్టు.

"అట్లాగే!"

"ఇందూ! నేను ఎప్పుడూ నీలోనే ఉంటాను. నిన్ను విధవగా చూడటం భరింప రాని విషయం. పైగా తెల్ల దుస్తుల్లో ఆడ వాళ్లని చూడాలని తలంపు వస్తే నాకు తల నొప్పి. నేను పోగానే యెవరినయినా పెండ్లి చేసుకుంటాననూ" అన్నాడు.

ఆమె కళ్ళవెంబడి నీరుధారా ప్రవాహంగా కారుతున్నది. ఈశ్వర్ "ఏడ్వకు ఇందూ" అంటూ ఆమె కళ్ళ వెంబడి నీటి చుక్కలని తుడిచాడు అతి కష్టంమీద.

"మీరు చనిపోకూడదు" అన్నది అతని కళ్ళల్లోకి చూస్తూ.

అతని కళ్ళు ఆనందంతో మెరిసిపోతున్నది.

"లాభం లేదు ఇందూ! నేను ప్రపంచాన్ని పరిహసిస్తే కాలం నన్ను పరిహసిస్తూంది కాని ఆ కాలాన్ని చూచి కూడా నేను నవ్వు తున్నాను. ఈ విధంగా నా ఇందుమతి చేతుల్లో ఇందు మతి బాహువుల్లో..." అతని స్వరం తప్పిపోయింది. ఆమె అతని ముఖంవంక చూస్తున్నది. కడసారి ఆమె పెదవులు అతని మొఖంనిండా స్నేహస్నిగ్ధ పూర్వకమైన ప్రేమ వర్షాన్ని కురుపించినవి. అంతే. ఆమె మొఖాన మరల కన్నీటి చుక్క లేదు.

* * *

"ఆమె అప్పటికప్పుడే డాక్టరు దగ్గరకు వెళ్ళి ఈశ్వర్ చనిపోయాడని చెప్పింది. డాక్టర్ ఆమె ఇద్దరూ కలసి అతని దహన సంస్కారాలు చేయించారు. ఆమె మొఖాన ఏడ్పులేదు. అందరూ చూచి ఆశ్చర్యమందారు. సాయంత్రమే చక్కగా అలంకరించుకొని పెట్టె సర్దింది" అన్నాడు శివకయ్య.

"ఆ!" అన్నాడు శర్మ ఆశ్చర్యంతో.

"ఆమె బయలుదేరి వెళ్లబోయే సమయంలో డాక్టరు వచ్చి ఎక్కడకని అడిగాడు. ఆమె అతనివంక నిలువెత్తు ఒకసారి చూచి అన్నది: "మీరు ఇంత నటన ఎందుకు ఆడవలసివచ్చింది? ఆమాత్రం ఈశ్వర్ గ్రహించుకోలేదు అను కున్నారా? మీరు ముందుగానే తెలియపరచి ఉన్నట్లయితే బాగుండేది."

---

పెళ్ళిపందిరి ఆలస్యంగా చేరుకున్నందుకు, తనకాబోయే భార్యకు నీళ్లు వొదులుకో వలసి వచ్చింది ఒక పెళ్లికొడుకు

పెళ్లికుమారుడు, అతని స్నేహితుడు జమ్మూ కు పోతూండగా, వెల్లువలవల్ల మధ్యదారిలో ఆగవలసి వచ్చింది. ఇద్దరూ ఈదడం ఆరంభించారు. స్నేహితుడు నెగ్గాడుకాని, పెళ్లికుమారుడు సాధించలేకపోయాడు.

పెళ్లికుమారుడు ముహూర్తానికి అందుకోకపోవడంవల్ల గాభరా చెందిన పిల్లతండ్రి మంచిముహూర్తం చెయ్యిదాటిపోవడం ఇష్టంలేక, ఇద్దరిలో మేలైన ఈతగాడికే తన కుమార్తె నివ్వడానికి నిశ్చయించుకున్నాడు.